సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

SK1 one NEWS HD

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 168 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | ఆదివారం 06-09-2026


## విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడమే టీచర్లకు గొప్ప గుర్తింపు



❖విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయులకు లభించే గొప్ప గుర్తింపు అని ఎంపీ శ్రీభరత్ అన్నారు.

❖ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఎంపీ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయులకు లభించే గొప్ప గుర్తింపు అని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మిగతా 2లో

## ఎస్సీ, ఎస్టీల రక్షణకు

# పటిష్ఠ వ్యవస్థ

**ఉపాధ్యాయులకు చంద్రబాబు శుభాకాంక్షలు.. సర్వేపల్లి జీవితం ఆదర్శనీయం**

- ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నాలుగంచెల కార్యాచరణ ప్రణాళిక
- ఈ ఏడాది నమోదైన 810 కేసులన్నీ పరిష్కరించామని వెల్లడి
- 2023 నుంచి బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారం అందజేత
- రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీల ఏర్పాటు
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులకు చంద్రబాబు శుభాకాంక్షలు
- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- సర్వేపల్లి రాధాకృష్ణన్ విలువలను భావితరాలు పాటించాలని పిలుపునిచ్చిన సీఎం
- రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు




రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలును పటిష్ఠంగా పర్యవేక్షించేందుకు రూపొందించిన నాలుగంచెల కార్యాచరణ ప్రణాళికపై మిగతా 2లో

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?



- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం
- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారన్న రఘునందన్ రావు
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. మిగతా 2లో

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

- మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్
- మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య
- విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని



ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై మిగతా 2లో

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా మిగతా 2లో

## రాజ్యాంగం కల్పించిన ఆ స్వేచ్ఛ ఇక ముస్లింలకు వర్తించదా?



- సహారన్‌పూర్ కలెక్టరేట్‌లో మసీదు కూల్చివేత
- రాజ్యాంగ మత స్వేచ్ఛపై ఓవైసీ ప్రశ్న
- 1911 నాటి రికార్డులు ఉన్నాయన్న ఓవైసీ
- కోర్టు ఆదేశాలతో కూల్చివేత చేపట్టిన అధికారులు
- ఘటనతో ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ దుమారం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ఇక వర్తించదా? అని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు మసీదును కూల్చివేసినట్లు తెలిపారు. మసీదు ఉనికిని నిరూపించే 1911 నాటి రికార్డులు కమిటీ వద్ద ఉన్నాయని ఓవైసీ చెప్పారు. శతాబ్దానికి పైగా అక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది 'వక్ఫ్ బై యూజర్' పరిధిలోకి మిగతా 2లో

## తెలంగాణలోనూ అలా గెలవాలన్నది

# బీజేపీ ప్లాన్

**పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశాం**

- విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ
- కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.
- SIR పేరుతో కేంద్రం ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలనే ముఖ్యంగా టార్గెట్ చేశారని చెప్పుకొచ్చారు.
- ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారు అంటూ వ్యాఖ్యానించారు.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సమావేశమయ్యారు.



కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. SIR పేరుతో కేంద్రం ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలనే ముఖ్యంగా టార్గెట్ చేశారని చెప్పుకొచ్చారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారు అంటూ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'కొడంగల్ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకోవడం వల్లే మిగతా 2లో

## ఇది దేవుడు చెప్పిన సత్యం: బొత్స



- చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువేనని.. ఇది దేవుడు చెప్పిన సత్యం అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు.
- అనకాపల్లి జిల్లాలో ఎక్కడ చూసినా మైనింగ్ జరుగుతుంది. ఏపీ గంజాయి మత్తులో తూగుతోంది.
- వాస్తవాలను చెబుతున్నప్పుడు సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేసే అధికారం ఎవరిచ్చారు?" అంటూ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.

చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువేనని.. ఇది దేవుడు చెప్పిన సత్యం అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో ఎక్కడ చూసినా మైనింగ్ జరుగుతుంది. ఏపీ గంజాయి మత్తులో తూగుతోంది. వాస్తవాలను చెబుతున్నప్పుడు సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేసే అధికారం ఎవరిచ్చారు?" అంటూ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. "వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు పదివేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చాము. సుమారు లక్షల 50 వేల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశాం. మిగతా 2లో

## టీడీపీ ప్రభుత్వం మోసపూరిత

# ప్రచారాలతో లేనిపోని గొప్పలు

**అక్షరాస్యతపైనా అబద్ధాలా?**

- అధికారిక లెక్కలు 71.4%.. మరి 82.1% ఎక్కడి లెక్క?
- గణాంకాలు ఒకలా.. మంత్రి ప్రచారం మరోలా.. ఇందులో మతలబు ఏమిటి?
- 2026 ఏడాదే ఇంకా పూర్తి కాలేదు.. ఏ సంస్థా గణాంకాలు విడుదల చేయలేదు
- అధికారిక గణాంకాలు స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం



అక్షరాస్యతపై చంద్రబాబు ప్రభుత్వం తప్పుడు గణాంకాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మిగతా 2లో

## కాంగ్రెస్‌ను బర్తరఫ్ చేయాల్సిందే:కేటీఆర్




- లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను
- కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్
- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్
- మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అని మండిపడ్డారు మాజీ మంత్రి కేటీఆర్. మిగతా 2లో

## భూగర్భ జలాలు కలుషితం కాకుండా

# తగిన చర్యలు తీసుకోవాలి

**ఆంధ్రా పేపర్ మిల్లుపై చర్యలు తీసుకోండి**

- రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు వెంటనే సమ న్లు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ)ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు.
- నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని పీసీబీ అధికారులకు సూచించారు.
- ఈ కంపెనీ యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతోందని, పన్నులు మాత్రం ఉద్దేశపూర్వకంగా ఎగ్గొడుతోందని అన్నారు



రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు వెంటనే సమ న్లు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ)ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. నిబంధనల మేరకు మిగతా 2లో

సీమకిరణం
కర్నూలు నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు.విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు.కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## రాజ్యాంగం కల్పించిన ఆ స్వేచ్ఛ ఇక ముస్లింలకు వర్తించదా?

వస్తుందని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి అక్కడ ప్రార్థనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు ఆ భూమిపై హక్కు ఎలా కోరుతుందని ఓవైసీ ప్రశ్నించారు. "మసీదు ముందే ఉంది.. కలెక్టరేట్ ఆ తర్వాత వచ్చింది" అని వ్యాఖ్యానించారు. మసీదును కూల్చేందుకు బుల్డోజర్ ఉపయోగించడాన్ని తప్పుబట్టారు. "నా మత స్వేచ్ఛ మీ దయపై ఆధారపడి లేదు" అని స్పష్టం చేశారు.కోర్టు ఆదేశాల మేరకే కూల్చివేత చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మసీదును ప్రభుత్వ భూమిపై ఉన్న అక్రమ నిర్మాణంగా కోర్టు గతంలో ప్రకటించింది. ముస్లిం పక్షం దాఖలు చేసిన అప్పీల్‌ను జిల్లా న్యాయస్థానం శుక్రవారం తిరస్కరించింది. దీంతో శనివారం భారీ భద్రత మధ్య కూల్చివేత చేపట్టారు.ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. సహారన్‌పూర్ వెళ్లేందుకు సిద్ధమైన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్‌ను పోలీసులు ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆమె వర్గం తెలిపింది. ఆమె నివాసం వద్ద భారీగా బలగాలను మోహరించారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ కూడా కూల్చివేతను తప్పుబట్టారు. భూమి రికార్డులు, వక్ఫ్ బోర్డు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ పరిణామంతో పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

## ఇది దేవుడు చెప్పిన సత్యం: బొత్స

ఎక్కడైనా మాపై ఒక చిన్న ఆరోపణ వచ్చిందా? ఎక్కడైనా డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆధారాలు లభించాయా?. వైఎస్ జగన్ పాలనలో ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరిగింది. కూటమి పాలనలో స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వడం కోసం ఒక జీవో తీసుకువచ్చారు. ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత ఆ జీవోను రద్దు చేశారు" అంటూ బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు.డీఎస్సీలో ఉద్యోగాల కోసం బేరాలు పెట్టారు. శాసనమండలిలో చర్చకు రమ్మంటే తోక ముడిచి పారిపోయారు. విశాఖ నగరాన్ని సర్వనాశనం చేశారు. గీతం యూనివర్సిటీకి వేల కోట్లు చేసే భూములు అప్పగించారు. ఎవడబ్బ సొమ్ము అని 3 వేల కోట్లు ధారాదత్తం చేస్తారు?. గ్రావిటీ ద్వారా పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళం చివరికి నీరు ఇవ్వాలి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇచ్చి గోదావరి జలాలు ఇచ్చామని ప్రచారం చేస్తారా?. పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది వైఎస్సార్.. అందుకు నేను సాక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి గెలిచి తీరాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబులా పారిపోయే మనస్తత్వం వైఎస్ జగన్‌ది కాదు" అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడమే టీచర్లకు గొప్ప గుర్తింపు

జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు 'టీచర్స్ డే' శుభాకాంక్షలు తెలియజేశారు. 69,947 మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 1500 మంది విద్యార్థులు పెరిగారన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని చెప్పుకొచ్చారు. 'ఆరోగ్యం, విద్యకు నా ఎంపీ లాడ్స్ నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నా. పాఠశాలలో మౌలిక వసతులు కావాలంటే మా దృష్టికి తీసుకురావాలి' అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.ఉపాధ్యాయులకు ఎన్ని అవార్డులు ఇచ్చినా వారు చేసే సేవ ముందు తక్కువే అని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అన్నారు. ఉపాధ్యాయులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. 'ప్రతి ఒక్కరి విజయం వెనుక ఒక టీచర్ ఉంటారు... నా మొదటి గురువు నా తల్లి. నేను ఐఏఎస్ కాకపోతే ఉపాధ్యాయ వృత్తి వైపు వెళ్లేవాడిని' అని చెప్పుకొచ్చారు. వైజాగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు దేశంలోనే ఒక బ్రాండ్‌గా ఉండాలి అన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విశాఖ జిల్లాలో విద్యార్థులను ఉపాధ్యాయులు మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వెల్లడించారు.

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం. ప్రజలకు మరో న్యాయమా?

అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు

**రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు అయ్యన్న ప్రకటన**

**వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి**

**ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న**



ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలోనూ అలా గెలవాలన్నది బీజేపీ ప్లాన్

జాతీయ స్థాయిలో కొడంగల్‌కు ఈ గుర్తింపు, గౌరవం వచ్చింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం **SIR** పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోంది. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను టార్గెట్ చేశారు. మహారాష్ట్ర, బీహార్, బెంగాల్ ఎన్నికల్లో అలాగే గెలిచారు. తెలంగాణలోనూ అలాగే గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. తెలంగాణలో దొంగ దెబ్బ తీస్తామంటే ఇక్కడ చూస్తూ ఊరుకునేవారు లేరు. ఓట్లు తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసింది. ఇంతకుముందు ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు ఓట్ల తొలగింపుతో తడిగుడ్డతో గొంతు కోసే చర్యలకు దిగుతున్నారు. చిన్న తప్పిదాలను సాకుగా చూపి బీజేపీ పేదల ఓట్లను తొలగించే కుట్ర చేస్తోంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఈ కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోంది. ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉంది. ప్రజల ఓట్లు కాపాడాల్సిన బాధ్యత ముఖ్య నాయకులపై ఉంది. గ్రామాల వారీగా బీఎల్ఏలను సమన్వయం చేసుకుని పేదల ఓట్లు తొలగించకుండా చూడాలి. ఓట్లు తొలగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత మండల నాయకులదే. నాలుగు గ్రామాలకు ఒక నాయకుడు బాధ్యత తీసుకోవాలి. ప్రతీ బూత్‌లో ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్త వహించాలి. అందరూ అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని.. అమ్మలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. వికారాబాద్ జిల్లాలోని మద్దూరు, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్‌లో దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలేపల్లి శివారుకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. 5 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ (విద్యా ప్రాంగణం) నిర్మాణ పనుల్లో పురోగతిని పరిశీలించారు. ఈ విద్యా ప్రాంగణం దేశానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. పనుల్లో వేగం పెంచాలని.. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూనే 2027 మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని గడువు విధించారు. విద్యా ప్రాంగణం చుట్టూ వరద?ష్టం నీరు నిలవకుండా ఏర్పాట్లు చేయాలని.. ఇందుకోసం టెక్నాలజీ వినియోగించుకోవాలని సూచించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విద్యా ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏటీసీ, సైనిక్ స్కూల్, వెటర్నరీ కళాశాల, 430 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు.తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు.కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.మక్తల్--నారాయణ పేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ.. సీఎం చంద్రబాబు సమీక్ష

అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది.ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా 'ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి, చట్టం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద 810 కేసులు నమోదు కాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుల విచారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రత్యేక సెషన్స్ కోర్టులు, ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వివరించారు.ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడంపై కూడా సమావేశంలో చర్చించారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి, మహోన్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని, ఆయన స్మృత్యర్థం సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.భావి భారత పౌరులను తీర్చిదిద్దుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సమాజ నిర్మాణంలోనూ, విద్యారంగంలోనూ గురువుల పాత్ర ఎంతో అమూల్యమైనదని ఆయన కొనియాడారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అత్యంత సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ఆయన, తన ఆదర్శవంతమైన జీవనశైలితో దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి బాధ్యతలను చేపట్టారని పేర్కొన్నారు. సర్వేపల్లి ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని.. ఆయన చూపిన మార్గాన్ని, పాటించిన విలువలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం ఈరోజు (శనివారం) రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిగాయి.అక్టోబర్ 1వ తేదీ నుంచి రెండు డీఏల చెల్లింపునకు ఏపీ సర్కార్ అంగీకరించింది. సరెండర్ లీవులను జనవరిలో వేసేందుకు ఆమోదించింది. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రిస్టోరేషన్‌కు కూటమి సర్కార్ ఆమోదం తెలిపింది. సీఎం ప్రకటనపై ఉద్యోగ సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని.. వారికి సాధ్యమైనంత అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అనంతరం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించిన నిర్ణయాలను ముఖ్యమంత్రి వెలువరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలివే..

12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం.

రెండు డీఏలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి చెల్లింపు.

1-7-2024 నుంచి 1-1-2025 డీఏల విడుదల

2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్‌ను వచ్చే సంక్రాంతికి అకౌంట్‌లో వేయడానికి ఏపీ ప్రభుత్వం అంగీకారం.

పోలీసులకు ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు.

అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి- 2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం.

70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు.

ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేసేందుకు ఆమోదం.

వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపునకు కూటమి సర్కార్ అంగీకారం.

ఈ నిర్ణయాల కారణంగా ప్రతి ఏడాది రూ.2880 కోట్లను ఖర్చు చేయడానికి ఏపీ ప్రభుత్వం అంగీకరించింది.

పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు: రామకృష్ణ

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగిందని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు ఉ కార్యవర్గం జి. రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశం అత్యంత సానుకూల వాతావరణంలో జరిగిందని వెల్లడించారు. ఏపీ సచివాలయ సంఘం తరపున సచివాలయ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఇళ్ల స్థలాల కేటాయింపు,ౕ=జ చైర్మన్ నియామకం, నూతన ప్రభుత్వ భవనాల సముదాయంలో రాష్ట్ర సచివాలయానికి ప్రత్యేక టవర్ కేటాయింపు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, జూనా క్రమబద్ధీకరణ, సీపీఎస్‌కి ఆమోదయోగ్య శాశ్వత పరిష్కారం వంటి పలు కీలక అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.

# టీడీపీ ప్రభుత్వం మోసపూరిత ప్రచారాలతో లేనిపోని గొప్పలు

'వాస్తవ పరిస్థితులను, గణాంకాలను వక్రీకరిస్తున్నారు. అధికారిక గణాంకాలు ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత రేటు 71.4 శాతంగా స్పష్టం చేస్తుంటే.. విద్యా శాఖ మంత్రి మాత్రం 82.1 శాతం అంటూ ప్రచారం చేయడం వెనుక ఉన్న లెక్కల మతలబు ఏమిటి?' అని ప్రశ్నించారు. ఇంకా పూర్తికాని 2026 సంవత్సరానికి అక్షరాస్యత గణాంకాలు ఎలా వచ్చాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ పోస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ట్యాగ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఆ పోస్టులో ఇంకా ఏమన్నారంటే..'సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏ స్థాయిలో తప్పుడు సమాచారంతో ప్రచారం చేసుకుంటోందో చూస్తుంటే నిజంగా ఆశ్చర్యం కలుగుతోంది. 2024లో 72.6 శాతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత రేటు 2026లో 82.1 శాతానికి పెరిగిందని విద్యా శాఖ మంత్రి ప్రకటించారు. కానీ 2026 కేలండర్ సంవత్సరానికి సంబంధించిన అక్షరాస్యత గణాంకాలను ఇప్పటి వరకు ఏ అధికారిక సంస్థ విడుదల చేయలేదు. అసలు 2026 సంవత్సరమే ఇంకా పూర్తి కాలేదు. మరి 82.1 శాతం అనే లెక్క ఎక్కడి నుంచి వచ్చింది? కేంద్ర ప్రభుత్వ గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వే ఆధారంగా పీఎల్ఎఫ్ఎస్ (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) 2023--24 వార్షిక నివేదికను రూపొందించారు. జూన్ 2023 నుంచి జూన్ 2024 మధ్య కాలానికి సంబంధించిన ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఏడు సంవత్సరాలు పైబడిన వారి అక్షరాస్యత రేటు 72.6 శాతం. 2018--19లో 69.1 శాతంగా ఉన్న ఈ రేటు 2023 -- 24 నాటికి 72.6 శాతానికి చేరింది. అలాగే, జనవరి 2025 నుంచి డిసెంబర్ 2025 మధ్య ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన పీఎల్ఎఫ్ఎస్ కేలండర్ ఇయర్ 2025 వార్షిక నివేదికను 2026 జూలై 2న విడుదల చేశారు. ఈ అధికారిక నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఏడు సంవత్సరాలు పైబడిన వారి అక్షరాస్యత రేటు 71.4 శాతం మాత్రమే.

యూడైస్ గణాంకాల ప్రకారం వైఎస్ జగన్ హయాం(2023--24)లో, చంద్రబాబు హయాం (2025--26)లో రాష్ట్రంలో విద్యార్థుల వివరాలు

అధికారిక గణాంకాలు ఇంత స్పష్టంగా అందుబాటులో ఉన్నప్పటికీ, 82.1 శాతం అంటూ తప్పుడు లెక్కలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం. మరో ఆందోళనకరమైన అంశం ఏమిటంటే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో నమోదు పెరుగుతోందని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన యూడైస్ (యూడీఐఎస్‌ఈ) గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలి? ప్రభుత్వ పాఠశాలలను ఎలా బలోపేతం చేయాలి? అనే అంశాలపై దృష్టి పెట్టాల్సిన టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రచారాలతో లేనిపోని గొప్పలు చెప్పుకోవడంలోనే నిమగ్నమైంది. విద్యాశాఖ మంత్రి 'రెడ్‌బుక్ పాలన'పై సమయం వెచ్చించడం మానుకుని, తన శాఖపై ఎక్కువ సమయం, శ్రద్ధ పెట్టడం మంచిది' అని వైఎస్ జగన్ హితవు పలికారు.

# భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి

తగిన చర్యలు తీసుకోవాలని పీసీబీ అధికారులకు సూచించారు. ఈ కంపెనీ యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతోందని, పన్నులు మాత్రం ఉద్దేశపూర్వ కంగా ఎగ్గొడుతోందని అన్నారు. పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చిన ప్రతి సారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకు తిరుగుతోందని ఆక్షేపించారు. తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినా స్పందించలేదని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా పేపర్ మిల్లు తీరును శుక్రవారం 'ఎక్స్' వేదికగా పవన్ కల్యాణ్ వెల్లడించారు. 'ఆంధ్రా పేపర్ మిల్లు పన్ను ఎగవేతకు దాదాపు పుష్కర కాలం కావస్తోంది. 2016 తర్వాత కాతేరు గ్రామ పంచాయతీకి కానీ, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు కానీ ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించలేదు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా మీకు మీరే(పేపర్ మిల్లు) పన్ను మినహాయింపు ఇచ్చేసుకున్నారా? ఇది ఎలా సాధ్యం? రూ.21.34 కోట్ల వరకు మీరు స్థానిక సంస్థలకు పన్నులు చెల్లించాల్సి ఉంది.రాజమండ్రి నగర కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్ మిల్లు నుంచే వస్తోందని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. రాజమండ్రి నగరంలో మొత్తం 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే.. అందులో 35 మిలియన్ లీటర్లు మీరు ఉత్పత్తి చేస్తున్నారు. మీరు విడుదల చేస్తున్న వ్యర్థాల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్లు నిర్ధారణైంది. మీరు వ్యర్థాలు విడుదల చేసే లగూన్స్ దగ్గర సేకరించిన నమూనాలను పరీక్షించగా, లీటర్ నీటికి 36 మిల్లీ గ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ ఉంది. ఇది నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం అధికం. ఫాస్ఫేట్ 5.3 మిల్లీగ్రాములు అంటే.. 6 శాతం అధికంగా ఉంది. సల్ఫైడ్స్ 3.4 మిల్లీ గ్రాములు ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలతో పోల్చితే ఇది 70 శాతం అధికం. దీంతో నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాల మనుగడకు ఇబ్బంది కలుగుతోంది. గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. దుర్గంధాలు వెదజల్లుతూ నీటి నాణ్యత తగ్గి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ, భవిష్యత్ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి పర్యటనలో నేను సూచనలు చేశాను. వాటిని కూడా మీరు పాటించలేదు' అని దుయ్యబట్టారు.

లైసెన్సు రద్దు చేయవచ్చు.. అయినా

'ఆంధ్రా పేపర్ మిల్లు ఉల్లంఘనలకు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి కఠిన చర్యలు తీసుకోవచ్చు. పరిశ్రమలో కార్యకలాపాలు నిలుపుదల చేయవచ్చు. పెనాల్టీలు విధించవచ్చు. కంపెనీని సీజ్ చేయవచ్చు. ఏకంగా లైసెన్సును రద్దు చేయవచ్చు. అయినా పరిశ్రమ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చి తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇచ్చింది. గడిచిన మూడు నెలల్లో పీసీబీ అధికారులు మీ ప్రతినిధులతో పలుమార్లు చర్చించి పరిష్కార మార్గాలు సూచించారు. అయితే మీ నుంచి స్పందన పూర్తిగా కొరవడింది. అందువల్ల పీసీబీ అధికారులు తక్షణమే ఆంధ్రా పేపర్ మిల్లుకు సమన్లు జారీ చేసి నిబంధనలకు మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నాను. ప్రభుత్వం తరఫున ఏజీ, అదనపు ఏజీతో పాటు ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు ఇలాంటి ఉల్లంఘన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసే లా, తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాను. గోదావరిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం నుంచి మద్దతు కోరుతున్నా' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు

# కాంగ్రెస్‌ను బర్తరఫ్ చేయాల్సిందే:కేటీఆర్

పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టడం కాదు..మీ కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.యూత్ డిక్లరేషన్లో 24 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదు...100 రోజుల్లో అమలు చేస్తామని అన్నారు.. 1000 రోజులు అయింది,బకాసురులులాగా తింటున్నారు, కుంభకర్ణుల్లా పండుకుంటున్నారు, పంది కొక్కుల్లా తింటున్నారు.. అది తప్ప కాంగ్రెస్ వాళ్లు చేసింది ఏమీ లేదు అన్నారు. మళ్లీ కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నారు...తెలంగాణ కేసీఆర్ రాజీనామా చేయాలా..? లేదా రేవంత్ రెడ్డి అనే బట్టెబాజ్ గాడు చేయాలా చెప్పాలన్నారు.అతడు సినిమాలో బ్రహ్మానందం నాలుగు రోజులు ఎక్సర్‌సైజ్ చేసి నాకు బాగా బలం వచ్చిందని చెప్పి మహేష్ బాబుని హిట్ మీ యార్, హిట్ మీ అని అంటాడు..మహేష్ బాబు గట్టిగా గుద్దితే బ్రహ్మానందం కిందికెళ్ళి పేస్ట్ కారుతుంది..కేసీఆర్‌తో పెట్టుకుంటే రేవంత్ రెడ్డి గతి కూడా అదే అవుతుంది అన్నారు.మూడు తరాలను తెలంగాణలో ముంచిన ముసలి నక్క కాంగ్రెస్...1956లో తెలంగాణకు, ఆంధ్రకు ఇష్టంలేని బలవంతపు పెళ్లి చేసింది ఈ ముసలి నక్కే...1968లో 370 మందిని కాల్చి చంపిన ముసలి నక్క కాంగ్రెస్...1971లో 11 మంది పార్లమెంట్ సభ్యులను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే, వాళ్లను గుంజుకొని పోయి కాంగ్రెస్‌లో కలుపుకుంది ఈ ముసలి నక్కే...2004లో సోనియా గాంధీ మాటిచ్చి ఆ తర్వాత పదేళ్లు తెలంగాణ ఇవ్వకుండా సతాయించింది...శ్రీకాంతాచారి లాంటి తమ్ముళ్లు వందల మంది ప్రాణాలు కోల్పోయాక, కేసీఆర్ నిరాహార దీక్ష చేశాక ఈ ముసలి నక్క తెలంగాణ ఇచ్చింది అన్నారు.ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అని మండిపడ్డారు మాజీ మంత్రి కేటీఆర్. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టడం కాదు.. మీ కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యార ని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు.

# యాజమాన్యం దిగి రావాల్సిందే

## 12వ రోజుకు చేరిన సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన





**ప్యాపిలి సెప్టెంబర్ 05 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండలం బోయినచెరువుపల్లి సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట పలు గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. రోజురోజుకూ ఆందోళనకు మద్దతు పెరుగుతుండటంతో పెద్ద సంఖ్యలో గ్రామాల ప్రజలు తరలివచ్చి తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ తమ న్యాయబద్ధమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చి, ఆచరణలో పరిష్కారం చూపే వరకు ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆందోళన ఉధృతం కావడంతో సీఐ వెంకటరామి రెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆందోళనకారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### డిమాండ్ల పరిష్కారమే లక్ష్యం

తమ ఆందోళన ఎవరికీ వ్యతిరేకంగా కాదని, తమ న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసమే నిరసన చేపడుతున్నామని ఆందోళనకారులు పేర్కొన్నారు. ఇప్పటికే 12 రోజులుగా ఆందోళన కొనసాగుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఆందోళనకారులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు. లేదంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యం దిగి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళన నేపథ్యంలో ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనకుండా పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్,సీమ సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, కిష్టయ్య, లాల్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రజిని యాదవ్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర వెలకట్టలేనిది

## డిజిటల్ యుగంలోనూ ఉపాధ్యాయుడి ప్రాధాన్యత తగ్గదు : డాక్టర్ శంకర్ శర్మ

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 05, (సీమకిరణం న్యూస్):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాకుండా, ఉత్తమ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీబీసీ కళాశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శంకర్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి డాక్టర్ శంకర్ శర్మతో పాటు ముఖ్య అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ విద్యాసంస్థలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను డాక్టర్ శంకర్ శర్మ ఘనంగా సన్మానించి అభినందించారు.



### గురువులే సమాజ నిర్మాతలు

ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయుల ద్వారానే సమాజం నిర్మించబడుతుందని అన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించే బాధ్యత గురువులపై ఉందన్నారు. ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ ఉపాధ్యాయుల ప్రాధాన్యత మాత్రం వెలకట్టలేనిదని స్పష్టం చేశారు. సాంకేతికత విద్యకు సహాయకారిగా ఉండగలదే తప్ప, గురువు స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయలేదన్నారు.

### సెల్‌ఫోన్ వినియోగంపై అప్రమత్తత అవసరం

ప్రకృతిని మానవజాతి దెబ్బతినే విధంగా వినియోగించుకోవడం ఆందోళనకరమని డాక్టర్ శంకర్ శర్మ పేర్కొన్నారు. ముఖ్యంగా నేటి తరంలో సెల్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సెల్‌ఫోన్‌లో ఉన్న ప్రతి అంశాన్ని చూడకుండా ఉపయోగకరమైన, విజ్ఞానాన్ని పెంపొందించే విషయాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీబీసీ కళాశాల కరస్పాండెంట్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాష, ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు నాగరత్నమయ్య, ప్రిన్సిపాల్ సునీత రోజ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





డోన్ టౌన్, సెప్టెంబర్ 05,(సీమ కిరణం న్యూస్): ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు, స్థానిక కొత్తపేట జడ్పీ హైస్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవమునకు ప్రధానోపాధ్యాయులు రామ నరసప్ప అధ్యక్షత వహించగా సీనియర్ ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి, చంద్రుడు ,జయప్రద,సుజాత,సుధాకర్ ,రమేష్ బాబు, ముఖ్య అతిథిలుగా హాజరుఅయిన సందర్భంగా ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు రామనరసప్ప డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు, అనంతరం రామ నరసప్ప మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవం గురించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ ఉపాధ్యాయ దినోత్సవంను జరుపుతున్నారని విద్యార్థులకు తెలియజేశారు, సీనియర్ ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ గురువు, శిష్యుడు కు ఉన్న సంబంధం వివరించి విషయం క్లియర్ గా తెలిపారు, భారత తోలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఈ దినోత్సవంను ఘనంగా జరుపుకొంటారు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్య అభ్యాసం, ఉపాధ్యాయులు గా పని చేసి, దేశ వ్యాప్తంగా మంచి పేరుతో కలిగి ఉన్నారు, ఆ తర్వాత ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి గా ఉండి దేశానికి సేవలు అందించిన మహోన్నత వ్యక్తి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ అనీ , విద్య ను నేర్చుకుంటే ఎవరూ కూడా దొంగతనం చేయలేరు, అదే సమయంలో డబ్బు ఆస్తి ఉంటే దొంగలించేవారని, కాబట్టి విద్యార్థులందరు క్రమశిక్షణ కలిగి మంచి భవిషత్తు కలిగిన విద్య ను నేర్చుకోవాలి అన్నారు,చంద్రుడు జయప్రద, సుధాకర్, రమేశ్ బాబు, సుజాత వారు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5 తేదీ 1888 సంవత్సరములో తమిళనాడు లో జన్మించారాని, ఆయన దేశానికి చేసిన సేవలు గురించి విద్యార్థులకు తెలియ చేశారు, మరియు విద్యార్థుల ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల క్రమశిక్షణ, మంచి అలవాట్లు,వినయం, విధేయత కలిగిఉండాలనీ, స్కూల్ కు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని, మీకు మంచి భవిషత్తు ఉంటుంది అనీ అన్నారు, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి రాము చేసిన యాంకరింగ్ అందరిని ఆకట్టుకుంది, అనంతరం పాఠశాలలో విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయుల అందరిని ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగ లక్ష్మమ్మ, అనూష నారాయణ, రజినీకాంత్, పుష్పలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హెరాల్డ్స్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## హెరాల్డ్స్ స్కూల్‌లో సందడిగా టీచర్స్ డే వేడుకలు

## గురువులకు సన్మానం... విద్యార్థుల సందడితో


## కళకళలాడిన పాఠశాల!

## విద్యార్థుల్లో ఆనందోత్సాహం!












**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 05, (సీమకిరణం న్యూస్):** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని ఇడ్లీ హోటల్ సమీపంలో ఉన్న హెరాల్డ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని హెరాల్డ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పౌలూస్ పేర్కొన్నారు. గురువు కేవలం విద్యను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థులకు సన్మార్గం చూపే మార్గదర్శి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెరాల్డ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పౌలూస్ తో పాటు ఫాదర్ ఏసుబాబు, స్కూల్ ప్రిన్సిపాల్ మరియట్ట, ఉపాధ్యాయులు అనీ, నవీన, రేష్మా, విజయ, మరియళ్ళ, మాదోని, సింధ్య, భాగ్యలక్ష్మి, సులేఖ, బ్రదర్ రాహుల్తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ

## తహసిల్దార్ భారతి




**ప్యాపిలి సెప్టెంబర్ 05 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలోని నేరేడుచర్ల గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భారతి పాల్గొని అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ భారతి మాట్లాడుతూ రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్కుల్లో నమోదైన భూమి వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. భూమికి సంబంధించిన వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులకు రెవెన్యూ సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సోమశేఖర్, సర్వేర్ లోకేష్, లాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు

# క్రీడా రంగంలో ప్యాపిలి పాఠశాల జయకేతనం..

## జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం



**ప్యాపిలి, సెప్టెంబర్ 5 (సీమ కిరణం న్యూస్):** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్యాపిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ ఘన విజయానికి గుర్తింపుగా పాఠశాలకు క్రీడా ప్రతిభ పురస్కారం--2026 లభించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి ప్యాపిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు. సరళాదేవి, వ్యాయామ విద్యా సంచాలకులు జి. విజయలక్ష్మి, శ్రీకళలను ఘనంగా సన్మానించి పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖాధికారి మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థినులు, ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ విద్యా సంచాలకులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. ప్యాపిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి క్రీడా ప్రతిభ పురస్కారం--2026 అందుకోవడంపై పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**డోన్ టౌన్, సెప్టెంబర్ 05,(సీమ కిరణం న్యూస్):** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి శనివారం వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటా మని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఈ-కేవైసీ తప్పనిసరి చేయించుకోవాలి..





**వెల్దుర్తి, సెప్టెంబర్ 5 (సీమకిరణం న్యూస్):** పంట సాగు చేసి పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా తెలిపారు. అదేవిధంగా పంటల బీమా పథకం కింద నమోదు చేసుకున్న రైతులు కూడా తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. పంటలకు బీమా ప్రీమియం చెల్లించినప్పటికీ ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే పంటల బీమా పథకం ప్రయోజనం వర్తించదని తెలిపారు. రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి 2026 సెప్టెంబర్ 15వ తేదీలోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒకసారి వినియోగించే సంకేతపదం, ముఖ గుర్తింపు, వేలిముద్ర వంటి జీవ గుర్తింపు విధానాల ద్వారా రైతులు స్వయంగా ఈ-కేవైసీ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ-కేవైసీ కోసం రైతులు https://karshak.ap.gov.in/ecrop/farmerack వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా కూడా రైతులు స్వయంగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అక్బర్ బాషా పేర్కొన్నారు. వెల్దుర్తి, అల్లుగుండు గ్రామాల్లో రైతుల ఈ-కేవైసీ ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషాతో పాటు రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు లత, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

# ఫ్యాన్లు, లైట్లు, టీవీ, ఫ్రిజ్.. అన్నీ ఆఫ్ చేసినా విద్యుత్ మీటర్ ఎందుకు నడుస్తుంది? కారణం ఇదేనా..

ఇంట్లో ఫ్యాన్లు, ఏసీ, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాలు ఆఫ్ చేసినా విద్యుత్ మీటర్ నడుస్తుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్టాండ్‌బై పవర్, ఇన్వర్టర్లు, శాశ్వతంగా కనెక్ట్ చేసిన పరికరాలు విద్యుత్‌ను వినియోగించవచ్చు. అన్నీ డిస్‌కనెక్ట్ చేసిన తర్వాత కూడా మీటర్ వేగంగా నడిస్తే వైరింగ్, లోడ్, మీటర్‌ను నిపుణులతో తనిఖీ చేయించుకోవడం మంచిది. ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు, ఏసీ, టీవీ, ఫ్రిజ్‌తో పాటు ఇతర విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఆఫ్ చేసినా కూడా కొంతమంది ఇంట్లో విద్యుత్ మీటర్ నడుస్తూనే ఉంటుంది. అప్పుడు మీటర్ పాడైందా? లేదా మన మీటర్‌పై వేరే వారు కరెంట్ వాడుతున్నారా? అనే డౌట్లు వస్తాయి. అయితే మీటర్ కదులుతున్నంత మాత్రాన అది తప్పనిసరిగా సాంకేతిక లోపం అని అర్థం కాదు. ఇంట్లోని కొన్ని పరికరాలు ఆఫ్ చేసిన తర్వాత కూడా స్వల్పంగా విద్యుత్‌ను వినియోగిస్తూ ఉండొచ్చు.

### స్విచ్ ఆఫ్ చేసినా విద్యుత్ ఎందుకు ఖర్చవుతుంది?

టీవీలు, సెట్‌టాప్ బాక్సులు, వై-ఫై రౌటర్లు, మైక్రోవేవ్‌లు, కంప్యూటర్లు, ఛార్జర్లు, స్మార్ట్ పరికరాలు వంటి వాటిని రిమోట్ లేదా స్విచ్ ద్వారా ఆఫ్ చేసినా అవి పూర్తిగా విద్యుత్ సరఫరా నుంచి డిస్‌కనెక్ట్ కావు. కొన్ని పరికరాలు స్టాండ్‌బై మోడ్‌లో కొనసాగుతాయి. ఈ సమయంలో స్వల్పంగా విద్యుత్ వినియోగం జరుగుతుంది. దీనినే సాధారణంగా 'స్టాండ్‌బై పవర్' అంటారు. ఇక ఇన్వర్టర్లు కూడా ఇంటి విద్యుత్ వ్యవస్థకు నిరంతరం అనుసంధానమై ఉంటాయి.

# భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకం

సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుని

విద్యార్థులను తీర్చిదిద్దాలి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి తగిన

మార్గనిర్దేశం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి
























**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 05, (సీమకిరణం న్యూస్) :** భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని, ఉపాధ్యాయులు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. శనివారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమంలో కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తాను కూడా ఎం.ఎస్సి. పూర్తి చేసిన అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉపాధ్యాయ వృత్తితోనే తన ప్రస్థానాన్ని ప్రారంభించానని ఎంపీ తెలిపారు. విద్యార్థులను ప్రతిరోజూ మేల్కొలుపుతూ, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించడం ద్వారా దేశానికి మార్గనిర్దేశం చేస్తున్న గురువుల సేవలను స్మరించుకునే అవకాశం లభిస్తోందన్నారు. విద్యార్థులు ఇంటికంటే ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతున్నందున వారి విద్యాభివృద్ధితో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత గురువులపై ఉంది. వారికి నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భావి తరాల అభివృద్ధికి బలమైన పునాది వేయాలి" అని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యాబోధనలోనూ మార్పులు అవసరమని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యను అందించాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి న్యాయం చేస్తూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం మెరుగుపరచడంతో పాటు విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా రంగ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధనలో అవసరమైన మార్పులు చేసుకుంటూ, విద్యార్థులను భావి సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

### విద్యార్థులకు జ్ఞానంతో పాటు మానవీయ విలువలను అందించాలి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం ఎంతో గొప్పదైన, పుణ్యప్రదమైన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లో, ఉపాధ్యాయుల సమక్షంలో గడుపుతున్నందున వారి భావోద్వేగ, మానసిక అవసరాలను కూడా ఉపాధ్యాయులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులలోని బలాలు, బలహీనతలను గుర్తించి, అవసరమైన సమయంలో తగిన మార్గనిర్దేశం, మానసిక మరియు భావోద్వేగ సహకారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సానుకూలమైన మార్గనిర్దేశం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో నిర్వర్తించాలని కోరారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా లభించిన ఈ పురస్కారాలు మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన విద్యాభ్యాసంలో మార్గనిర్దేశం చేసిన గురువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వ్యక్తి జీవితంలో తొలి గురువు తల్లేనని పేర్కొంటూ, తన తల్లితో పాటు తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులు : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు మానవీయ విలువలు, నైతికత, క్రమశిక్షణ వంటి అంశాలను కూడా ఉపాధ్యాయులు నేర్పించాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. డీఎస్సీ ద్వారా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించిందని తెలిపారు. అనంతరం గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. పాఠశాల విద్యాశాఖకు చెందిన 36 మంది, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన 12 మంది కలిపి మొత్తం 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి .సుధాకర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, ఇంటర్మీడియట్ ఆర్.ఐ.ఓ లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదే : మంత్రి ఫరూక్

నాణ్యమైన విద్యతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు - కలెక్టర్ రాజకుమారి

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి, జిల్లా కలెక్టర్
















**నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 05, (సీమకిరణం న్యూస్) :** విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన 45 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, మహోన్నత విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి ప్రతిభను గౌరవిస్తూ అవార్డులతో సత్కరించడం సంతోషకరమైన విషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన, పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మంత్రి సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా, కమ్యూనికేషన్ రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. నంద్యాల జిల్లా ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చెందుతూ డిగ్రీ, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ తదితర ఉన్నత విద్యా సంస్థలకు కేంద్రంగా మారిందన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు చేసిన త్యాగాలు, కష్టాలు అభినందనీయమని, వారి కృషికి తగిన ఫలితంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధితో పాటు సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.

### ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ,"ఉపాధ్యాయుడు ఒక శిల్పి వంటివారని, శిల్పి ఒక రాయిని అందమైన శిల్పంగా మలిచినట్లే, ఉపాధ్యాయులు విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు" అని పేర్కొన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఆకాంక్ష మేరకు ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతి గది నాలుగు గోడల మధ్య బోధన చేస్తున్నప్పటికీ, వారి కృషి దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. ప్రతి విద్యార్థిని సమాన దృష్టితో చూడాలని, ముఖ్యంగా స్లో లెర్నర్స్‌పై ప్రత్యేక శ్రద్ధ, ప్రేమ చూపిస్తూ వారి అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నంద్యాల జిల్లాలో స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ విభాగాల్లో మంచి వర్క్ కల్చర్ ఉందని కలెక్టర్ ప్రశంసించారు. విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య మరింత మెరుగైన సమన్వయం, సాన్నిహిత్యం అవసరమన్నారు.

### విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, మన బడి-మన భవిష్యత్తు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, పీఎం శ్రీ పాఠశాలలు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. విద్యార్థుల్లో కేవలం విద్యా సామర్థ్యం మాత్రమే కాకుండా మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌ను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. "నేను చేయలేను" అనే భావన విద్యార్థుల్లో రాకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థులను కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం చేయకుండా ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లోనూ ప్రోత్సహించాలని తెలిపారు. విజయంతో పాటు ఓటమిని కూడా సమర్థంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు.

### మెడిసిన్, ఇంజనీరింగ్‌తో పాటు అన్ని అవకాశాలపై అవగాహన కల్పించాలి

10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతరం విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ విద్యా, ఉద్యోగ అవకాశాలపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల లక్ష్యాలను కేవలం మెడిసిన్, ఇంజనీరింగ్‌కే పరిమితం చేయకుండా సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, పరిశోధన రంగాల వైపు కూడా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయకుండా యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించేలా, పీహెచ్‌డీ, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన, మంచి పట్టు కల్పించడం ద్వారా వారి కెరీర్‌కు బలమైన పునాది వేయవచ్చన్నారు.

### విద్యా ఫలితాలను మరింత మెరుగుపరచాలి

10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లా ర్యాంకును మరింత మెరుగుపరచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజు నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలు లేకుండా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా, సాధ్యమైనంత వరకు 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. సాధారణ విధుల్లో భాగంగా పనిచేయడమే కాకుండా విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆత్మకూరు మండలం కొట్టాల చెరువు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను కేవలం 5-10 నుంచి 135కు పెంచిన ఉపాధ్యాయుడి సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న 45 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి, కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. జనార్దన్ రెడ్డి, డిఐఈఓ శంకర్ నాయక్, ఉపాధ్యాయులు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com